క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

కొల్లాపూర్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం వాహనాల వేలం వేస్తున్నట్లు సీఐ నాగిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు మోటార్‌సైకిళ్లకు వేలం పాట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలలోగా ఎక్సైజ్ కార్యాలయంలో రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి యోగా తరగతులు

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం నుంచి ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు పతంజలి శంకర్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6.45 నుంచి 7.45 వరకు, సాయంకాలం 5 నుంచి 6 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

6న విద్యార్థి మేళా

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో డిసెంబర్ 6న నిర్వహించే బహుజన విద్యార్థి మేళాన్ని విజయవంతం చేయాలని బహుజన విద్యార్థి సమైక్య రాష్ట్ర కోకన్వీనర్ బోరెల్లి సురేష్ కోరారు. బుధవారం మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సాయిబాబు పాల్గొన్నారు.

వరి ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలి

పెద్దకొత్తపల్లి: రైతులు వరి ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి 17 శాతం తేమ ఉండేవిధంగా చూసుకోవాలని ఏఈఓ ముజీబ్ కోరారు. మండల కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం తేమను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కల్వకుర్తిరూరల్: డివిజన్ గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం ముఖ్య నాయకుడు ఎల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవడంతోపాటు బాధ్యతలు స్వీకరించారు. గౌరవ అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్, అధ్యక్షుడిగా నారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణగౌడ్, కోశాధికారిగా కృష్ణయ్యగౌడ్, ముఖ్య సలహాదారులుగా బాలస్వామిగౌడ్, సాంబయ్యగౌడ్, మహిళా ప్రతినిధిగా గీతతోపాటు 30 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

బీమా పథకాలను వినియోగించుకోవాలి

చారకొండ: అర్హులుగా ఉన్న బ్యాంకు ఖాతాదారులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జూపల్లి ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ శివప్రసాద్ అన్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లిలో ఏపీజీవీబీ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి జనసురక్ష క్యాంపెయిన్ నిర్వహించారు. జీవన జ్యోతి, సురక్ష, బీమా మొదలైన పథకాల గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది భాస్కర్ రెడ్డి, సంపత్‌రెడ్డి, వీఓఏ సంతోష గ్రామస్తులు, ఖాతాదారులు తదితరులు ఉన్నారు.

విద్యాకమిషన్ సభ్యుడికి సన్మానం

చారకొండ: రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనిశెట్టి నాగేంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. మండలంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం బాధిత కుటుంబానికి మాజీ ఉపసర్పంచ్ ఎర్రయ్య రూ.4వేలు, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణయ్య రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు యాదయ్య, వెంకటయ్య, రవి ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి

కోడేరు: పురాతన వినాయక విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ధ్వంసం చేసిన విగ్రహ స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నిందితులను పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. మండల కోఆప్షన్ మాజీ సభ్యులు అబ్దుల్ ఖరీం, పాడేళ్ల సురేష్, చామంతి రాజు, ఆదిరాజు, మిద్దె రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకకు చేరిన పాదయాత్ర

అచ్చంపేట రూరల్: అయ్యప్ప మాలధారులు నవంబర్ 11న అచ్చంపేట నుంచి శబరిమలకు బయలు దేరిన పాదయాత్ర బుధవారం నాటికి బెంగుళూరు పట్టణ సమీపంలోని గుంజూరు చేరుకుంది. 17 రోజుల పాటు సుమారు 480 కిలోమీటర్ల వరకు సాగింది.

హాస్టళ్లలో అధికారుల తనిఖీలు



రఘుపతిపేట ఎస్సీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ శ్రీనునాయక్



అచ్చంపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

కల్వకుర్తిరూరల్: హాస్టల్ విద్యార్థులకు నాణ్యతలేని భోజనం వడ్డిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ శ్రీనునాయక్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండలంలోని రఘుపతిపేట ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను, వంట సామాగ్రిని పరిశీలించారు. అనంతరం వార్డెన్ యాదయ్యకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ హరిందర్‌రెడ్డి, ఆర్ఐ రావూఫ్ తదితరులు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎస్టీ హాస్టల్, ఎస్సీ హాస్టల్‌ను ఆర్డీఓ మాధవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, వంట సరుకులను పరిశీలించారు. వసతిగృహాల్లో వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్నానపుగదులు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా చూడాలన్నారు. మండలంలోని ఐనోల్ ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలను ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్ పరిశీలించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ కేశవ్ పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని బీసీ బాలుర వసతి గృహం, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలో నిల్వ ఉన్న వంటసరుకులను పరిశీలించారు. కుళ్లిన కూరగాయాలు, కాలం చెల్లిన నూనెలు, పప్పులను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ శంకర్, వసతి గృహం వార్డెన్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గది, బియ్యం, ఇతర నిత్యవసర సరకులు, కూరగాయలను పరిశీలించారు. సిబ్బంది, తదితరులు ఉన్నారు.

లింగాల: విద్యార్థినిలకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ ఆంజనేయులు ఎస్ఓ శారద, ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వెల్దండ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో



లింగాల కస్తూర్బా విద్యాలయంలో ..



ఉప్పునుంతల కేజీబీవీలో..

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు సదస్సుకు నియోజకవర్గం నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 30న నిర్వహించే భారీ బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారన్నారు. సదస్సులో 150 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారని, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మండలాల నాయకులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తర్నికల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ జనార్దన్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. సన్నరకాలకు రూ.500 లు ప్రభుత్వం బోనస్ ఇస్తుందన్నారు. శ్యాం, శ్రీను, శ్రీశైలం, కొండల్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి రైతులను కోరారు. మండలంలోని జీలుగుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి రకం వరి ధాన్యానికి రూ.2,320, రెండో రకానికి రూ.2,300 ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ పాండు, రైతులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌లాల్

ఉప్పునుంతల: ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని ఎంపీడీఓ మోహన్‌లాల్ కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని అన్ని పార్టీల నాయకులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఓటరు నమోదుకు దరఖాస్తులు చేసుకున్న అర్హులను ఓటరు జాబితాలో చేర్చినట్లు పేర్కొన్నారు. తుది ఓటరు జాబితాలను ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శుల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిలో ఏమైనా తప్పిదాలు ఉంటే వెంటనే సంబంధిత పంచాయతీ కార్యదర్శికిగాని, నేరుగా ఎంపీడీఓ కార్యాలయంలో గాని ఫిర్యాదు చేయొచ్చని వివరించారు. సమావేశంలో ఎంపీఓ నారాయణ, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ గురుస్వామి

తెలకపల్లి: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేష్, షీటీం ఇన్‌చార్జ్ ఎస్ఐ విజయలక్ష్మి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌నేరాలపై షీటీం అధికారులు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు హాజరై మాట్లాడారు. ఆధునిక సమాజంలో ఆన్‌లైన్ మోసాలు అధికం అయ్యాయన్నారు. మహిళలు, విద్యార్థినులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. టీసేఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ప్రయాణం చేయాలన్నారు. ఎవరైన ఆకతాయిలు వేధిస్తే డయల్ 100 కు లేదా 8712657676 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. జిల్లా షీటీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, భరోసా కోఆర్డినేటర్ శ్రీలత, ఎస్ఐ నరేష్, ఆ కళాశాల ప్రిన్స్‌పాల్ రశ్మి, షీటీం అధికారులు వెంకటయ్య, జ్యోతి, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం సైబర్‌నేరాలపై ఎస్ఐ గురుస్వామి అవగాహన కల్పించారు. వ్యక్తిగత వివరాలను ఎవరికి చెప్పొద్దన్నారు. సోషల్‌మీడియాలో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆటో స్టాండ్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఏటా రూ.12 వేలు ఇస్తామన్నా హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, రజాక్‌నాంగేంద్రగౌడ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాలలో భాగంగా విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై మండలంలోని చేగుంట, గొరిట, తిమ్మాజిపేటలోని తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులు వ్యాసరచన పోటీలలో పాల్గొన్నారు. ఎంఈఓ సత్యనారాయణశెట్టి పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, దేవేందర్, సరేష్, అమరసింహారెడ్డి, అనిత పాల్గొన్నారు.

మూడో మహాసభలను విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: సీపీఎం మూడో జిల్లా మహాసభలను డిసెంబర్ 14, 15 తేదీలలో అచ్చంపేట పట్టణంలో నిర్వహిస్తున్నట్లు కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి పాదిల రామయ్య పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం రాజకీయాలు, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, భవిష్యత్ కార్యాచరణపై చర్చ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సురేష్, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థిని రెండు ఉద్యోగాలకు ఎంపిక

బల్మూర్: మండలంలోని కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని రేణుక కానిస్టేబుల్‌గా, ఉపాధ్యాయురాలిగా రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. బుధవారం ప్రిన్సిపాల్ పరంగి రవి కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న రేణుకను కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో శాలూవాలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటయ్య, అశోక్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, మల్లయ్య, గాయత్రి, నర్సింగరావు, నర్సింహ్మ, శివమ్మ, ఫర్జాన బేగం, చాంద్ బి, రేణుక, ఆంజనేయులు, పాల్గొన్నారు.

ఏఓకు వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని కోరుతూ బుధవారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న కలెక్టరేట్ లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. మేడిపూర్, ఎటిదార్‌పల్లి, గోవిందాయిపల్లి, శిర్సవాడ గ్రామాల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని వివరించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యాక్షుడు అనువగల్ల సత్యనారాయణ, బాలు, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం

తెలకపల్లి: బాల్య వివాహాలను అరికడదామని కోనేరు సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాకొండలో కైలాస్‌సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఉన్న గ్రామ పంచాయతీ ప్రాంతంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోనేరు సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌యాదవ్, జాకీర్‌హుస్సేన్, వసంత, చంద్రయ్య, బక్కయ్య, సాయిలు, నాగయ్య, హుస్సేన్, భారతమ్మ, లక్ష్మీదేవమ్మ, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

'ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలి'



తాడూరులో సర్వే వివరాలు నమోదు చేయిస్తున్న సిబ్బంది

వెల్దండ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింట సర్వేను ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్ నమోదులో ఆపరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలన్నారు. ఎంతశాతం నమోదు చేశారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఆర్ఐ శంకర్‌నాయక్, ఎంపీఓ లక్ష్మణ్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ రేవంత్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా సర్వే నమోదు ప్రక్రియ

తాడూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను బుధవారం ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బ్రహ్మచారి మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే 98 శాతం పూర్తి అయ్యిందన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లకు పలు సూచనలు, సలహాలు చేశారు.

లింగాల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదును ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. సకాలంలో ఆన్‌లైన్ నమోదును పూర్తి చేయాలని సూచించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ చంద్రశేఖర్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎన్యుమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తాం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్

పెద్దకొత్తపల్లి: మతాల పేరుతో ఎవరైన గొడవలు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో బుధవారం క్రైస్తవులు, అయ్యప్పస్వాములు బీజేపీ నాయకులతో శాంతియుత సమావేశం నిర్వహించారు. ఎవరి మతాన్ని కించపర్చకుండా ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు. సమావేశాలు నిర్వహించుకునేముందు పోలీసుస్టేషన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. సమావేశంలో కొల్లాపూర్ సీఐ మహేష్, పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్, పాస్టర్ సామ్యూల్, బీజేపీ మండల అధ్యక్షుడు బీమేశ్వర్‌రెడ్డి, అయ్యప్పస్వాములు, తిరుపతయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే భూములు కేటాయించాలని నిరసన



నిరసన తెలుపుతున్న బుడగ జంగాలనాయకులు

పెద్దకొత్తపల్లి: అర్హులకే భూములు కేటాయించాలని కోరుతూ బుధవారం బుడగ, జంగాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ పెద్దకార్పాములలో దళితులు 47 సంవత్సరాలు సాగు చేసుకుంటున్న 17 ఎకరాల వ్యవసాయ భూమిని దళిత కుటుంబాలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. 1977వ సంవత్సరంలో ప్రభుత్వం 17 ఎకరాల సీలింగ్ భూమిని దళిత కుటుంబాలకు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం దళితుల భూమిని ఆన్‌లైన్‌లో లేకుండా తొలగించడం సరికాదన్నారు. ఇప్పటికైనా దళితరైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కృష్ణయ్య, నరహరి, సుభాష్, సిద్దార్థ, వెంకటేష్, మహేష్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

తెలకపల్లి: మండలంలోని గడ్డంపల్లి ఎంపీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పోలింగ్ ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో మాక్‌పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఓటు వేసే విధానం, పోలింగ్ సర్వేపైన అవగాహన కల్పించారు. ఓటుహక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రొసిడింగ్ అధికారి ఎం పరిమళ, ఏపీఓగా అనూష, రూట్ అధికారి శ్రావణి, ఏజెంట్లు రూపశ్రీ, స్వరూప, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయులు బాల్‌లక్ష్మయ్య, బసవయ్య, మల్లయ్య, వెంకటయ్య, సూర్యనారాయణ, యాదయ్య, నారాయణ పాల్గొన్నారు.

హామీలు విస్మరించడం తగదు

చారకొండ: ఇచ్చిన హామీలు ప్రభుత్వం విస్మరించడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి బండపల్లి బాలస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని జూపల్లి నుంచి వంగూరు గేట్ వరకు, మండల కేంద్రం నుంచి బైరాపూర్ వరకు మంజూరైన బీటీ రోడ్లను వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. గత నెలలో బీటీకి నిధులు మంజూరు అయినట్లు కాంగ్రెస్ నాయకులు చేసిన ప్రకటనలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మట్టిరోడ్లలో గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యేలు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని బీటీల నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మధు, నాయకులు శ్రీకాంత్, శేఖర్, దేవేందర్, రాకేష్, రామస్వామి, శ్రీను, వెంకటయ్య, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

వాల్ పోస్టర్ విడుదల



బిజినేపల్లి: హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1వ తేదీన నిర్వహించే మాలల సింహగర్జన సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి సామ మహేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూన నిరంజన్ బిజినేపల్లి ప్రధాన కూడలిలో విడుదల చేశారు. నాయకులు ఉదయ్, శివ, విష్ణు, బాలరాజ్, తదతిరులు పాల్గొన్నారు.

నిందితుడికి జైలుశిక్ష

పెద్దకొత్తపల్లి: పట్టణానికి చెందిన రైతు బెల్లె కృష్ణయ్య ఇంటి ఎదుట 2023 ద్విచక్రవాహనం ఉంచి నిద్రించాడు. బురుజు సాయికుమార్, బలారీ అజయ్‌కుమార్‌లు బైక్‌ను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. బుధవారం కొల్లాపూర్ కోర్టులో నిందితులను హాజరుపర్చారు. న్యాయమూర్తి జ్యోత్స్న గుంటి నిందితులకు 6 నెలల 17 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఇసుక డంపు సీజ్

ఉప్పునుంతల: మండలంలోని మొల్గర వద్ద అనుమతులు లేకుండ అక్రమంగా నిల్వచేస్తున్న ఇసుకను డంపును బుధవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు ఎమ్మార్ఐ సుజాత సీజ్ చేశారు. మొల్గర వద్ద దుందుబీ వాగులో నుంచి టిప్పర్‌తో వాగు సమీపంలోని పొలంలో ఇసుకను డంపు చేస్తుండగా గ్రామస్తులు కొంతమంది మైనింగ్ ఏడీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఎమ్మార్ఐ ఇసుక డంపును సీజ్‌చేశారు. దోమలపెంటలో హాస్పిటల్ నిర్మాణం కోసం నాలుగు టిప్పర్లు ఇసుక అవసరముండగా తన సూచనల మేరకే ఇసుకను తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తనతో ఫోన్‌లో చెప్పినట్లు ఎమ్మార్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యమైన ఘటనలో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని వినోభానగర్ కాలనీకి చెందిన సింధు ఈనెల 26న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లింది. కుటుంబసభ్యులు చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

లింగాల: మండలంలోని సూరాపూర్‌లో బుధవారం జల్లెల శంకర్ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో సంభవించింది. ఈ ప్రమాదంలో ఫ్రిజ్, వంట సామగ్రి, టీవీ, గింజలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. దాదాపుగా రూ. లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఘటన స్థలాన్ని ఏఆర్ఐ అనిల్ పరిశీలించి ప్రమాదంలో కాలి పోయిన వస్తు సామగ్రి వివరాలను నమోదు చేసుకున్నారు.

రైతులను విస్మరించిన ఘనత కాంగ్రెస్‌దే

అచ్చంపేట రూరల్: రైతులను విస్మరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను మోసం చేస్తూనే ఉందన్నారు. రైతులను మోసం చేశామని రైతు ఉత్సవాలను నిర్వహిస్తున్నారా...? అని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్రమోడీ రైతులకోసం వారి సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రారంభించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంటలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. బీజేపీ నాయకులు మంగ్యానాయక్, నరేందర్‌రావు, నాగరాజు, రేణయ్య, ధర్మనాయక్, శ్రీను నాయక్, జానకమ్మ, పత్యానాయక్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి